క్లుప్తంగా

బాలినేనికి రేల కృతజ్ఞతలు



బాలినేనిని సత్కరిస్తున్న రేల అమర్‌నాథ్‌రెడ్డి

ఒంగోలు: వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షునిగా నియమితులైన రేల అమర్‌నాథ్‌రెడ్డి శుక్రవారం ఆ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిని కలిసి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, ఈ నేపథ్యంలో తనను పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షునిగా ఎంపిక చేసేందుకు సహకరించడం ఆనందంగా ఉందని బాలినేనికి కృతజ్ఞతలు తెలిపారు. బాలినేని మాట్లాడుతూ యువతకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో బాకా శివారెడ్డి, రమేష్‌రెడ్డి, చంద్రశేఖర్, పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం ఎంఈవోపై చర్యలు తీసుకోవాలి

ఒంగోలు: ఎయిడెడ్ ఉపాధ్యాయుల జీతాల బిల్లులు చేయని మార్కాపురం మండల విద్యాశాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకట్రావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో విద్యాశాఖ అధికారిని కోరారు. మార్కాపురంలోని శివసాయి ఎయిడెడ్ పాఠశాలలో పనిచేసే ముగ్గురు ఉపాధ్యాయులను ఒంగోలు ఏబీఎం పాఠశాలకు బదిలీ చేశారని, తద్వారా పదో తరగతి విద్యార్థులకు సిలబస్ కూడా పూర్తికాకుండా వ్యవహరించారని తెలిపారు. ఒక టీచర్‌ను దొనకొండకు, మరో ఇద్దరిని ఒంగోలుకు బదిలీ చేశారన్నారు. ప్రస్తుతం ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లింపు సమయంలో ఉపాధ్యాయుల జీతాల బిల్లులు తాను చేయనని మార్కాపురం ఎంఈవో పేర్కొనడం ద్వారా ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని వివరించారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు.

పిల్లలను పరిశుభ్రంగా ఉంచాలి

- స్పెషల్ అధికారి అర్చన



అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల బరువును పరిశీలిస్తున్న అర్చన

ఈతముక్కల (కొత్తపట్నం): పిల్లలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్త, ఆయాలపై ఉందని మండల ప్రత్యేక అధికారి అర్చన అన్నారు. మండలంలోని ఈతముక్కలలో 79వ అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గర్భిణులకు సంబంధించిన వైఎస్సార్ కిట్లు అందుతున్నాయా.. లేదా..? ఒక్కో గర్భిణికి 25 గుడ్లు అందుతున్నాయా..? అనే వివరాలడిగి తెలుసుకున్నారు. ఏఎన్‌ఎంలు, ఆశాలు చెకప్ చేస్తున్నారా.. లేదా..? హెచ్‌బీ ఎంత శాతం ఉంది..? అనే వివరాలడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెనూ ప్రకారం ఆహారం అందించాలని, పిల్లల్లో చదువుపై ఆసక్తి పెంచాలని, వయసుకు తగ్గ బరువు, ఎత్తు ఉండేలా సరిచూసుకోవాలని సూచించారు. వయసుకు తగ్గ పోషకాలు లేకపోతే పోషకాలతో కూడిన ఆహారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య, పంచాయతీ కార్యదర్శి కిరణ్ కుమార్, నితిన్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మా విద్యాభివృద్ధికి ఏఎఫ్‌టీఐ సేవలు కీలకం

ఒంగోలు: ఫార్మా విద్యాభివృద్ధికి అసోసియేషన్ ఆఫ్ ఫార్మా టీచర్స్ ఇండియా సేవలు కీలకం అని కృష్ణతేజ ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు పేర్కొన్నారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని అంతర్జాతీయ మహిళా దినోత్సవ పక్షోత్సవ కార్యక్రమాన్ని అసోసియేషన్ ఆఫ్ ఫార్మా టీచర్స్ ఇండియా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు 5వ జోన్ రాష్ట్ర స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్విస్ కాలేజీ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ దక్షిణామూర్తి మాట్లాడుతూ 1966లో దేశంలో ప్రారంభమైన ఏఎఫ్‌టీఐ ఫార్మసీ ఎడ్యుకేషన్‌కు విశేష సేవలు అందించిందన్నారు. ఎంఎల్ జి. శ్రీవాస్తవ వంటి ప్రముఖులచే ఈ సంస్థ ప్రారంభమైందని, దీని ద్వారా మెరుగైన ఇంటర్ కమ్యూనికేషన్, ప్రమోషన్ రూపొందించడంలో చాలా ప్రగతిని సాధించామన్నారు. ఈ సందర్భంగా హాజరైన మహిళా ఉపాధ్యాయులకు శాస్త్రీయ, విద్యాబోధన, పరిశోధన, క్రీడా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందించారు. బాపట్ల ఫార్మసీ కాలేజీ, సెయింట్‌ఆన్స్ కాలేజీ ఆఫ్ ఫార్మసీ, చైతన్య కాలేజీ ఆఫ్ ఫార్మసీ, మలినేని లక్ష్మయ్య కాలేజీ ఆఫ్ ఫార్మసీ, నరసరావుపేట ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మస్యూటికల్ సైన్సెస్, ఏఎం రెడ్డి కాలేజీ ఆఫ్ ఫార్మసీ, డాక్టర్ శామ్యూల్ జార్జి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌ల నుంచి మహిళా అధ్యాపకులు ఈ సదస్సులో పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వహణ కమిటీ సభ్యులుగా డాక్టర్ కె. శ్రీకాంత్, డాక్టర్ బి.రేవతి, అధ్యాపకులు వ్యవహరించారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయండి

- ఒంగోలు మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు



జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న గృహాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి

ఒంగోలు రూరల్: మండలంలోని హౌసింగ్ సిబ్బంది, అన్ని గ్రామాల సచివాలయ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు అంకితభావంతో పనిచేసి వచ్చే ఉగాది నాటికి జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని ఒంగోలు నగర కమిషనర్, మండల స్పెషల్ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వరరావు ఆదేశించారు. ఒంగోలు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన శుక్రవారం సాయంత్రం నిర్వహించిన రూరల్ మండల కార్యదర్శులు, అధికారుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇతర మండలాలతో పోల్చుకుంటే జగనన్న కాలనీల్లో గృహాల నిర్మాణంలో కొంత వేగం తగ్గిందని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న నవరత్నాలలో భాగమైన పేదలందరికీ ఇళ్ల పథకం లక్ష్యం పూర్తిస్థాయిలో నెరవేరాలంటే సచివాలయ వ్యవస్థ అంకితభావంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా సచివాలయ సిబ్బంది, హౌసింగ్ ఏఈ, సిబ్బందితో ప్రత్యేకంగా చర్చించారు. మండలంలో 1,335 మంది లబ్ధిదారులకు ఎంతమొత్తంలో ఎస్‌హెచ్‌జీ లోన్లు, శ్రీనిధి లోన్లు ఇచ్చారో పూర్తిస్థాయి నివేదిక అందజేయాలని ఏపీఎం గోపీనాథ్‌ను ఆదేశించారు. ప్రతివారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ ఉగాదికి నిర్దేశించిన లక్ష్యాల గురించి ప్రత్యేకంగా చర్చించనున్నట్లు చెప్పారు. గ్రామ సచివాలయాల్లో జరుగుతున్న పీఎంజేఏవై సర్వే, ఎస్‌డీజీ సర్వే పురోగతి చాలా తక్కువగా ఉందని, గ్రామ సచివాలయ సిబ్బందిపై ఆయా గ్రామ కార్యదర్శులు దృష్టి సారించి వేగంగా సర్వేలు పూర్తి చేయించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి సచివాలయంలో మూమెంట్ రిజిష్టర్‌ను పూర్తిస్థాయిలో పక్కాగా నిర్వహించాలని, క్రమశిక్షణ రాహిత్యానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదని అన్నారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ పృథ్వీ, కార్యాలయ సిబ్బంది ప్రవీణ్, ఈవోఆర్డీ పూర్ణచంద్రరావు, వంశీ, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఒంగోలు మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు

గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి

- ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి

ఒంగోలు రూరల్: సచివాలయ వ్యవస్థ రాష్ట్ర ప్రభుత్వంలో ముఖ్య భాగమని, ఈ వ్యవస్థ ద్వారానే గ్రామాల అభివృద్ధిని సుసాధ్యం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారని ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కరవది గ్రామాన్ని ఆకస్మికంగా ఆయన సందర్శించారు. తొలుత గ్రామంలోని జగనన్న లే అవుట్లను పరిశీలించి గృహాల లబ్ధిదారులతో మాట్లాడారు. కరవది గ్రామంలో అత్యధిక వ్యయంతో భూసేకరణ చేసి లే అవుట్లు రూపొందించామన్నారు. మౌలిక సదుపాయాలైన రోడ్లు, తాగు నీరు, వాడుక నీటి కోసం ఇంటింటికి పైపులైన్ల నిర్మాణంతో పాటు విద్యుత్ సౌకర్యం, వీధి దీపాలు వంటి వసతులను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఇన్ని సదుపాయాలు కల్పించినప్పటికీ స్థలాలు, పట్టాల కోసం ఇబ్బడి ముబ్బడిగా దరఖాస్తు చేసిన వారు నేడు గృహ నిర్మాణాల చేపట్టడంలో మీనమేషాలు లెక్కించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. లబ్ధిదారులంతా గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని, ఆ మేరకు అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సూచించారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించి ఒక్కో సచివాలయ సిబ్బంది పనితీరుపై సమీక్షించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ పూర్ణచంద్రరావు, కార్యదర్శి వేమా శ్రీలక్ష్మి, సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గైర్హాజరైన వలంటీర్లకు నోటీసులు జారీ

- ఎస్‌డీజీ, పీఎం–జేఏవై సర్వేలపై ఆరా
- త్రోవగుంట సచివాలయం పరిధిలో వేగంగా పన్నులు వసూలు
- సచివాలయ సిబ్బందితో సమీక్షించిన కమిషనర్ వెంకటేశ్వరరావు



త్రోవగుంట వార్డు సచివాలయంలో సిబ్బందితో సమీక్షిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: త్రోవగుంట సచివాలయం పరిధిలో నిర్వహించిన సమీక్షకు హాజరుకాని వలంటీర్లకు నోటీసులు జారీ చేయాలని సచివాలయ అడ్మిన్‌ను ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఆదేశించారు. శుక్రవారం త్రోవగుంట వార్డు సచివాలయంలో సిబ్బందితో ఆయన సమీక్షించారు. సచివాలయ పరిధిలో ఉన్న 30 మంది వలంటీర్లకుగానూ కేవలం 17 మంది మాత్రమే హాజరయ్యారు. గైర్హాజరైన వారందరికీ నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. త్రోవగుంట సచివాలయ పరిధిలో మొత్తం 1,057 అసైన్‌మెంట్లు ఉన్నాయని, వేగంగా రీసర్వే చేపట్టాలని సిబ్బందికి సూచించారు. త్రోవగుంటలో పర్యటించి పారిశుధ్యాన్ని పరిశీలించారు. వార్డు సచివాలయ సిబ్బందితో సమీక్ష సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా సచివాలయ పరిధిలో జరుగుతున్న రీ సర్వే గురించి ఆరా తీశారు. సచివాలయ సిబ్బంది ఎవరూ తనకు తెలియకుండా సెలవు పెట్టరాదన్నారు. సచివాలయ పరిధిలో జరుగుతున్న ఎస్‌డీజీ సర్వే, పీఎం–జేఏవై సర్వే పురోగతి తక్కువగా ఉన్నందున సిబ్బందిపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వేలు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి మంగళవారం కలెక్టర్ నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లో పీఎం–జేఏవై గురించి, సర్వే పురోగతి గురించి అడిగి తెలుసుకుంటున్నారని గుర్తు చేశారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్ పథకంలో భాగంగా గవర్నమెంట్ వారు వసూలు చేస్తున్న యూజర్ ఫీజు కలెక్షన్స్ గురించి వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో చర్చించారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటిపన్ను, కుళాయి పన్నులు వసూలు చేయాలన్నారు. సత్యనారాయణపురం వార్డు సచివాలయ పరిధిలో మొత్తం రూ.20.92 లక్షలు వసూలు చేయాల్సి ఉందన్నారు. అందులో రూ.7.10 లక్షలు వసూలు చేశారని, మిగతా రూ.13.82 లక్షలు మార్చి నెలాఖరుకల్లా వసూలు చేయాలని చెప్పారు. సచివాలయ పరిధిలో అధిక మొత్తంలో బకాయిలు ఉన్న వారికి రెడ్ నోటీసులు జారీ చేయాలని ఆర్‌ఐని ఆదేశించారు. కార్యక్రమంలో ఏసీపీ కే వెంకటేశ్వర్లు, ఎంఈ కే మాల్యాద్రి, ఏఈ అంజిరెడ్డి, ఎంహెచ్‌వో మనోహరరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ పిచ్చయ్య, ఎంహెచ్‌వో మనోహరరెడ్డి, డీఈ రఘురాం, మిరియాల శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఒంగోలులో పడమటి సంధ్యారాగం

- అమెరికాలో లవ్, ఒంగోలులో మ్యారేజ్



కెలిన్నా, సాయికిరణ్

ఒంగోలు టౌన్: అబ్బాయిది ఒంగోలు.. అమ్మాయిది అమెరికా. చదువుకుని అమెరికాలోని ఒహాయ్లో సెక్యూరిటీ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు సాయికిరణ్. అక్కడే ఒక హోటల్లో ఇన్సూరెన్స్ కంపెనీలో టీం లీడర్‌గాగా పనిచేసే కెలిన్నాతో పరిచయమైంది. వీరిద్దరూ గత 5 ఏళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇద్దరూ కలిసి జీవించాలని నిర్ణయం తీసుకుని పెళ్లి చేసుకోవాలనుకున్నారు. ఇరువురి ఇళ్లలోనూ తొలుత అభ్యంతరం చెప్పారు. తర్వాత మెత్తబడి పెళ్లికి ఒప్పుకున్నారు. దీంతో అమెరికా నుంచి ఒంగోలుకు వచ్చిన అమ్మాయి.. హిందూ సంప్రదాయ పద్ధతిలో చీరకట్టి మెడలో తాళి కట్టించుకుంది. శుక్రవారం ఒంగోలులోని పీఏజీ కళ్యాణ మండపంలో చూడముచ్చటగా జరిగిన ఈ పెళ్లికి పలువురు హాజరై ఆశీర్వదించారు.

భూముల రీసర్వేపై ప్రత్యేక శ్రద్ధ వహించండి



అధికారులకు సూచనలిస్తున్న జేసీ అభిషిక్త్ కిషోర్

- మార్చి15 నాటికి సర్వే పూర్తి చేయండి
- జేసీ అభిషిక్త్ కిషోర్

చీమకుర్తి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సమగ్ర భూసర్వే కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ రెవెన్యూ, సర్వే అధికారులకు సూచించారు. ఆర్‌డీఓ విశ్వేశ్వరరావు, తహసీల్దార్ పి.మధుసూదన్‌రావుతో కలిసి శుక్రవారం జీఎల్‌పురంలో జరుగుతున్న రీసర్వే విధానాన్ని జేసీ పరిశీలించారు. సర్వే వివరాల ప్రస్తుత పరిస్థితి గురించి సమీక్షించారు. రీసర్వేలో అధికారులకు సహకరించాలని స్థానికులకు విజ్ఞప్తి చేశారు. చీమకుర్తి మండలంలో జీఎల్.పురం, బూసురపల్లి, పిడతలపూడి, బండ్లమూడి, ఆర్.ఎల్.పురం గ్రామాల్లో రీసర్వే కార్యక్రమం జరుగుతోంది. రీసర్వేలో మొదట డ్రోన్ సర్వే, గ్రౌండ్ ట్రూత్, గ్రౌండ్ వాల్యూయేషన్, డీఎల్ఆర్, 13 నోటిఫికేషన్, సిక్స్ లేయర్ ఓపెనింగ్, ఫైనల్ ఆర్ఓఆర్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. జీఎల్ పురం గ్రామంలో జరిగే రీసర్వేను మార్చినెల 15 నాటికి డీఎల్ఆర్ (డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్) పూర్తి చేయాలని సర్వే డిపార్టుమెంట్ అధికారులు, రెవెన్యూ అధికారులకు తెలిపారు. సర్వే త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులందరినీ బృందాలుగా విభజించాలని తహసీల్దార్‌తో పాటు సర్వే డిపార్టుమెంట్ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డీసీ ఎం.శ్రీదేవి, సర్వే ఏడీ గౌస్‌బాషా, డీఐలు ఆనంద్, రాజేంద్రప్రసాద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుడి జీవనోపాధికి ఆర్థికసాయం



దివ్యాంగుడికి ఆర్థికసాయం అందిస్తున్న ట్రస్టు చైర్‌పర్సన్

ఒంగోలు టౌన్: పోలియోతో బాధపడుతున్న దివ్యాంగుడి జీవనోపాధికి నగరానికి చెందిన సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ ఆపన్న హస్తం అందించింది. పుట్టుకతో పోలియో బారిన పడి బాధపడుతున్న సింగరాయకొండకు చెందిన సన్నబైన నాగేశ్వరరావు అనే దివ్యాంగుడు బతుకు తెరువు కోసం చిల్లర దుకాణం ఏర్పాటు చేసుకునేందుకు సహాయం చేయాల్సిందిగా ట్రస్ట్‌ను కోరారు. ఈ విషయాన్ని ప్రవాస భారతీయుడు కిరణ్ దృష్టికి తీసుకెళ్లి ఆయన సహకారంతో రూ.30 వేలను శుక్రవారం సూర్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో చైర్‌పర్సన్ షేక్ షెహనాజ్ చేతుల మీదుగా అందజేశారు. అర్హులైన పేదల జీవనోపాధికి అవసరమైన ఆర్థిక సాయాన్ని ముందు కూడా అందజేస్తామని ట్రస్ట్ కార్యదర్శి షేక్ సర్దార్ తెలిపారు.

అనాథలకు అన్నదానం



అనాథలకు అన్నదానం చేస్తున్న శ్రీహరి

చీమకుర్తి: శివం ఫౌండేషన్ అధ్యక్షుడు గొల్లపూడి శ్రీహరి ఆధ్వర్యంలో చీమకుర్తిలోని అనాథలకు శుక్రవారం అన్నదానం చేశారు. మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, నందిని వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఒంగోలులో కేక్ కట్ చేసి పేదలకు స్వీట్లు పంపిణీ చేశారు.

పేకాట శిబిరంపై సెబ్ దాడి

- నలుగురు నుంచి రూ.27,100, నాలుగు బైక్‌లు స్వాధీనం



నలుగురిని అదుపులోకి తీసుకున్న సెబ్ సిబ్బంది

చీమకుర్తి: సంతనూతలపాడు మండలం చిలకపాడు–మద్దులూరు పొలాల మధ్య నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై సెబ్ అధికారులు శుక్రవారం దాడి చేశారు. సంతనూతలపాడు సెబ్ ఆర్ఎస్సై ఎస్.శివప్రసాద్, చీమకుర్తి సెబ్ ఎస్సై ఎం.నగేష్, వారి సిబ్బందితో కలిసి దాడిలో పాల్గొన్నారు. కొండపి మండలం కట్టావారిపాలేనికి చెందిన నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.27,100తో పాటు నాలుగు బైకులను స్వాధీనం చేసుకొని సంతనూతలపాడు పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

బాలికపై లైంగికదాడి

ఒంగోలు టౌన్: నగరానికి చెందిన ఒక బాలిక మీద ఓ యువకుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సుజాత నగర్‌కు చెందిన ఒక బాలికల హైస్కూలులో పదో తరగతి చదువుతోంది. సుజాతనగర్‌లోని ఒక చర్చి వద్ద కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న బద్రీ (21) అనే యువకుడు శుక్రవారం ఆ బాలికను స్కూలు వద్ద దింపుతానని నమ్మించి బైకు మీద ఇందిరమ్మ కాలనీలోని తన ఇంటికి తీసుకెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో బలవంతంగా ఆ బాలిక మీద లైంగికదాడికి పాల్పడ్డాడు. అనంతరం బాలికను హైస్కూలు వద్ద దింపి వెళ్లాడు. ఈలోపు 10 గంటలైనా బాలిక స్కూలుకు రాలేదని హెడ్మాస్టర్ తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పారు. తండ్రి వచ్చేసరికి బాలిక స్కూలులో ఉంది. ఆలస్యంగా స్కూలుకు ఎందుకు వచ్చావని తండ్రి ఆరా తీయగా సదరు బాలిక లైంగిక దాడి జరిగిన విషయాన్ని చెప్పింది. దీంతో బాలిక తల్లిదండ్రులు తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కొత్తపల్లి అంకమరావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పొగాకులో యాజమాన్య పద్ధతులు పాటించండి

ఒంగోలు రూరల్: పొగాకు రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి నాణ్యమైన క్యూరింగ్, గ్రేడింగ్, ఆకు రెలుపుపై పూర్తిస్థాయిలో అవగాహన పొందాలని ఒంగోలు వేలం కేంద్రం–2 అధికారి రామకృష్ణ సూచించారు. మండలంలోని వలేటివారిపాలెం, మోడల్ గ్రామంలో శుక్రవారం రాత్రి పొగాకు బోర్డు ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పొగాకు రెలుపు చేసిన తర్వాత ఆకును టార్పాలిన్ పట్టపై వేయాలని, ఆపై అల్లకం చేయాలని తెలిపారు. అన్య పదార్థాలు లేకుండా చూడాలని, పదిహేను రోజులకోసారి మండెను తిరగవేయాలని చెప్పారు. బ్యారన్‌లో పొగాకు చేర్చిన తర్వాత థర్మామీటర్ ఏర్పాటు చేసుకుని ఎప్పటికప్పుడు ఉష్ణోగ్రతను పరిశీలించాలన్నారు. తొలుత ఈ కార్యక్రమంలో పీఎస్ఎస్‌హెచ్ ప్రతినిధి రామాంజనేయులు, జీపీ–1 ప్రతినిధి ఉన్నం, ఐటీసీ ప్రతినిధి ఎస్.ప్రశాంత్ మాట్లాడుతూ పొగాకు సాగులో మంచి లాభాలు పొందేందుకు, నాణ్యమైన గ్రేడు పొగాకు పొందేందుకు, బేళ్లు కట్టే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో వివిధ కంపెనీల ప్రతినిధులు, బోర్డు సిబ్బంది, రైతులు, రైతు నాయకులు మాట్లాడారు. తొలుత గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పలు బ్యారన్లను, గ్రేడింగ్‌లను పరిశీలించి సూచనలు చేశారు.

క్షుణ్ణంగా నామినేషన్ల పరిశీలన



నామినేషన్ల పరిశీలనకు లోనికి వెళ్తున్న వైఎస్సార్ సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యాంప్రసాద్‌రెడ్డి



అబ్జర్వర్, అభ్యర్థుల సమక్షంలో నామినేషన్ల పరిశీలన ప్రక్రియ నిర్వహిస్తున్న ఆర్‌వో హరినారాయణన్

- అబ్జర్వర్, అభ్యర్థుల సమక్షంలో ప్రతి నామినేషన్ పరిశీలన
- పట్టభద్రులకు 30 నామినేషన్లలో 7 తిరస్కరణ, 23 ఆమోదం
- టీచర్లకు 8కిగానూ 8 నామినేషన్ల ఆమోదం
- మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగిన నామినేషన్ల పరిశీలన
- ఈ నెల 27 వరకు నామినేషన్ల ఉపసంహరణ
- అదేరోజు.. బరిలో నిలిచే అభ్యర్థుల తుది జాబితా

చిత్తూరు కలెక్టరేట్: ఉమ్మడి ప్రకాశం–నెల్లూరు–చిత్తూరు జిల్లాల పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు దాఖలు చేసిన నామినేషన్ల పరిశీలన క్షుణ్ణంగా, పకడ్బందీగా జరిగింది. శుక్రవారం చిత్తూరులోని కలెక్టరేట్‌లో పరిశీలన ప్రక్రియ నిర్వహించారు. ఈ ఎన్నికలకు జిల్లాకు విచ్చేసిన అబ్జర్వర్లు కాటమనేని భాస్కర్, కోనశశిధర్, అభ్యర్థుల సమక్షంలో నామినేషన్ల పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరినారాయణన్ నామినేషన్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ ప్రక్రియకు నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులందరూ హాజరయ్యారు. తిరస్కరణ ఎందుకు చేయబడిందో అభ్యర్థులకు అధికారులు వెల్లడించారు. ఆమోదించిన, తిరస్కరించిన అభ్యర్థుల జాబితాను మధ్యాహ్నం 3 గంటలకు నోటీస్ బోర్డులో అతికించారు. ఈ నెల 27వ తేదీ వరకు నామినేషన్ల తిరస్కరణకు అవకాశం ఉంది. ఆ ప్రక్రియ అనంతరం బరిలో ఉండే అభ్యర్థుల జాబితాను అధికారులు ఈ నెల 27న ప్రకటిస్తారు. నామినేషన్ల ప్రక్రియ సమయంలో ఎలాంటి సమస్యలు చోటుచేసుకోకుండా కలెక్టరేట్ వద్ద పోలీసులు గస్తీ నిర్వహించారు. అభ్యర్థులను, ప్రతిపాదకులను పరిశీలించి లోనికి అనుమతించారు. ఈ ప్రక్రియలో డీఆర్‌వో రాజశేఖర్, ఏవో కులశేఖర్, సూపరింటెండెంట్లు మురళి, వెంకటేశ్వర్, శేషగిరి, డీఎస్పీలు శ్రీనివాసమూర్తి, తిప్పేస్వామి, సీఐలు మద్దయ్య ఆచారి, నరసింహరాజు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఆమోదం, తిరస్కరణలు ఇలా...

ఉమ్మడి ప్రకాశం–నెల్లూరు–చిత్తూరు జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల పరిశీలన పూర్తయిన తర్వాత వివరాలను ప్రకటించారు. ఆ వివరాల ప్రకారం పట్టభద్రులకు సంబంధించి 30 నామినేషన్లలో 23 నామినేషన్లు ఆమోదించగా, 7 నామినేషన్లను పలు కారణాలతో తిరస్కరించారు. ఉపాధ్యాయుల స్థానాలకు 8 నామినేషన్లకుగానూ 8 ఆమోదం పొందాయని ప్రకటించారు.

అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం ఎన్నికలకు ఆమోదం పొందిన ప్రకాశం జిల్లాకు చెందిన అభ్యర్థులు:

1. కిరణ్ దాసరన్న మట్టిగుంట (ఇండిపెండెంట్, వయస్సు 41)
2. మాదసి జాలారావు (ఇండిపెండెంట్, వయస్సు 41)
3. భాస్కరరావు కమ్మిశెట్టి (ఇండిపెండెంట్, వయస్సు 36)
4. మీగడ వెంకటేశ్వరరెడ్డి, (ఇండిపెండెంట్, వయసు 65)
5. త్రిపురాంతకం మండలానికి చెందిన పాతంగి పాలంకరెడ్డి (ఇండిపెండెంట్, వయసు 37)
6. మద్దిపాడుకు చెందిన గుల్లపల్లి వీరభద్రాచారి, (ఇండిపెండెంట్, వయసు 55)
7. మద్రిపూడి మండలానికి చెందిన కొమ్ము యోహోను (ఇండిపెండెంట్, వయసు 32)

పట్టభద్రులకు సంబంధించి తిరస్కరించబడిన నామినేషన్లు...

1. ఒంగోలుకు చెందిన రాయపాటి జగదీశ్ (ఇండిపెండెంట్, వయసు 38)
2. పొన్నలూరు మండలానికి చెందిన శివప్రసాద్‌రెడ్డి గుండాల (ఇండిపెండెంట్, వయసు 38)